సాక్షి
రంగారెడ్డి
గురువారం । 2 । మే । 2024



కాంగ్రెస్‌ది సంక్షేమ పాలన

కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమని.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు పని చేయాలని సీఎం రేంవత్‌రెడ్డి అన్నారు. 8లో▸



పోక్సో కేసులో జైలు శిక్ష

ప్రేమ పేరిట బాలికను నమ్మించి మోసం చేసిన వ్యక్తికి ఎల్‌బీనగర్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు 20 ఏళ్ల జైలు శిక్ష విధించింది. 8లో▸



చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా

చేవెళ్ల ఎంపీ స్థానాన్ని గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి అన్నారు. 8లో▸

న్యూస్‌రీల్

గ్రేటర్ @88.75 ఎంయూలు

డిస్కం చరిత్రలో ఇదే అత్యధికం

సాక్షి, రంగారెడ్డి జిల్లా: మండుతున్న ఎండలతో విద్యుత్ వినియోగం రెట్టింపవుతోంది. దక్షిణ తెలంగాణ విద్యుత్ పంపిణీ సంస్థ చరిత్రలోనే తొలిసారిగా మంగళవారం గ్రేటర్ పరిధిలో 4,214 మెగావాట్ల (88.75 మిలియన్ యూనిట్ల) విద్యుత్‌ను వినియోగించారు. 2022 ఏప్రిల్ 27న 3,435 మెగావాట్ల (72.02 ఎంయూ) విద్యుత్ వినియోగం నమోదు కాగా.. 2023లో మే 19న అత్యధికంగా 3,756 మెగావాట్లు (79.33 ఎంయూ) విద్యుత్ వినియోగం రికార్డు అయింది. రోజురోజుకూ పెరుగుతున్న విద్యుత్ వినియోగాన్ని చూసి ఇంజినీర్లు ఆందోళన చెందుతున్నారు. తరచూ జంపర్లు కట్ అవుతుండటం, ఇన్సులేటర్లు ఫెయిల్ అవుతుండటం, ఆయిల్ లీకేజీల కారణంగా డీటీఆర్‌లలో సాంకేతిక సమస్యలు తలెత్తుతున్నాయి. ముఖ్యంగా శివారు ప్రాంతాల్లోని పలు ఫీడర్ల పరిధిలో అంతరాయాలు తప్పడం లేదు.

రికార్డులు బ్రేక్..

2022 మార్చిలో నమోదైన విద్యుత్ వినియోగంతో పోలిస్తే, 2023 మార్చిలో 0.68 శాతం అధికంగా రికార్డ్ అయింది. 2022 ఏప్రిల్‌తో పోల్చితే 2023 ఏప్రిల్‌లో 0.97 శాతం అధికంగా నమోదైంది. 2023 మార్చితో పోల్చితే 2024 మార్చిలో 24.52 శాతం, ఏప్రిల్‌లో 19.66 శాతం అధికంగా విద్యుత్ వినియోగం జరిగింది.

మైసిగండి మైసమ్మ సన్నిధిలో దీపాదాస్ మున్షీ



కడ్తాల్: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వ్యవహారాల ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ బుధవారం మండల పరిధిలోని మైసిగండి మైసమ్మ దేవతను ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఏఐసీసీ కార్యదర్శి విష్ణు, స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి దర్శించుకున్నారు. ఆలయానికి చేరుకున్న ఆమెకు ఆలయ నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆలయంలో అమ్మవారికి దీపాదాస్ మున్షీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ నిర్వాహకులు ఆలయ విశిష్టతను వివరించి, అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేసి ఘనంగా సన్మానించారు. అంతకు ముందుకు నాగర్‌కర్నూల్ జిల్లా పర్యటనకు వెళ్తున్న ఆమెకు కడ్తాల్ మండల కేంద్రంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, నియోజకవర్గ కో ఆర్డినేటర్ ఇందిరాశోభన్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, గిరిజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ చేగూరి వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో దేశం దివాలా

- రాబోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే..
- చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చేవెళ్ల ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి

చేవెళ్ల: దేశంలో డెబ్బై ఏళ్లుగా కాంగ్రెస్ చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని పదేళ్లలో బీజేపీ ప్రభుత్వం పూర్తిగా నాశనం చేసి దివాలా తీయించిందని కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డి విమర్శించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా బుధవారం శంకర్‌పల్లిలో భారీ ర్యాలీ, రోడ్‌షో నిర్వహించారు. అనంతరం మనిగార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దుష్ట బీజేపీ పాలనను ఈ ఎన్నికల్లో అంతం చేయాలని అన్నారు. పదళ్లుగా ప్రజలను దోచుకొని బడానాయకులను పెంచి పోషిస్తోందని దుయ్యబట్టారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చినట్లుగానే ఈ ఎన్నికలతో కేంద్రంలో కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాబోతోందని జోస్యం చెప్పారు. ఎంపీగా ఐదేళ్లు తన పనితీరును చూశారని.. మళ్లీ అవకాశం కల్పిస్తే అంతకు రెట్టింపు చేసి చూపిస్తానని తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన బీంభరత్, ఎన్నికల ఇన్‌చార్జి సత్యనారాయణరెడ్డి, నాయకులు జనార్దన్‌రెడ్డి, ఉదయ్‌మోహన్ రెడ్డి, పెంటారెడ్డి, మండల మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

'పట్నం' సిగలో నయా కారిడార్

మహానగరానికి అతి సమీపంలో ఉన్న ఇబ్రహీంపట్నం దినాదినాభివృద్ధి చెందుతోంది. ఇక్కడి పెద్దచెరువు కేంద్రంగా ఏరియా అభివృద్ధికి హెచ్‌ఎండీ ప్లాన్ చేసింది. భారీ ఎత్తున భూసేకరణ చేసి స్వయం అభివృద్ధి (సెల్ఫ్ ఫైనాన్సింగ్)కి రూపకల్పన చేస్తోంది. ప్రధాన ప్రాంతీయ వినోద కేంద్రంగా పనులు చేపడుతోంది. మూలధన వ్యయం లేని ల్యాండ్ పూలింగ్ ద్వారా పలు ప్రాజెక్టులు తీసుకురానుంది. ఇవన్నీ అమలైతే నానక్‌రాంగూడ తరహాలో పదేళ్లలో 'పట్నం' రూపురేఖలు పూర్తిగా మారిపోనున్నాయి.

గ్రోత్ కారిడార్‌గా ఇబ్రహీంపట్నం

- ఏరియా అభివృద్ధికి హెచ్‌ఎండీఏ ప్లాన్
- 3,200 ఎకరాల భూసేకరణకు కసరత్తు
- దండుమైలారంలో డిస్నీల్యాండ్‌కు 5వేల ఎకరాలు
- ప్రజాభిప్రాయ సేకరణలో అధికారులు
- నానక్‌రాంగూడను తలపించేలా రూపకల్పన



హెచ్‌ఎండీఏ రూపకల్పన చేసిన ప్లాన్



చర్లపటేల్‌గూడలో రైతులతో సమావేశమైన హెచ్‌ఎండీఏ అధికారులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఇబ్రహీంపట్నం లేక్ డెవలప్‌మెంట్ పేరుతో పెద్ద చెరువుకు ఆనుకొని ఉన్న గ్రామాల్లో భూసేకరణకు హెచ్‌ఎండీఏ అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. ఇబ్రహీంపట్నం ఖాల్సా, భగాయత్, పోచారం, కప్పపహాడ్, తుర్కగూడ, చర్లపటేల్‌గూడ గ్రామాల్లో 309 సర్వే నంబర్లలోని 1,084 మంది పట్టాదారుల నుంచి 2,628 ఎకరాల భూమి సేకరించనున్నారు. దీనికి సంబంధించిన మార్చి 13న నోటిఫికేషన్ జారీ చేశారు. అప్పటి నుంచి అధికారులు ఈ ఐదు గ్రామాల్లో ప్రభుత్వ భూమల వివరాలు సేకరించారు. వారం రోజులుగా ఆయా గ్రామాలకు చేరుకొని భూసేకరణకు సహకరించాలని రైతులను కలుస్తున్నారు. అడిషనల్ కలెక్టర్ స్థాయి అధికారుల నుంచి కింది స్థాయి ఉద్యోగులు గ్రామాల్లో తిష్ట వేశారు. పట్టా భూములు, ప్రభుత్వ భూములను సేకరించనున్నారు. పట్టా భూమలకు 1,740 గజాలు, ప్రభుత్వ భూములకు 600 గజాల చొప్పున పరిహారంగా ఇవ్వనున్నారు.

సర్వే నంబర్లు ఇవే..

పోచారంలో సర్వే నంబర్లు 60 నుంచి 114, తుర్కగూడ 3 నుంచి 15, 17, 22- 52, 54- 60, కప్పపహాడ్ 9, 46, 69, 70-74, 89, 99, ఇబ్రహీంపట్నం భగాయత్ 196, 197, 365 నుంచి 385, 815బై1, 815బై2, ఇబ్రహీంపట్నం ఖాల్సా 532, 533, 538నుంచి 540, 543- 553, 587- 588, 691- 692, 694, 697- 721, 731-769, 780-785, 794-795, 798, 814, 817- 828, 1,049- 1,050, 1,088- 1,094, 1,096- 1,102, 1,104- 1,116, 1,129, 1,138 -1,145, 1,255 -1,256, 1,365- 1,371లోని భూములు సేకరించనున్నారు.

పెద్ద చెరువుకు మహర్దశ

ప్రాజెక్టులో భాగంగా పెద్ద చెరువును అన్ని విధాలా అభివృద్ధి చేయనున్నారు. వినోద కేంద్రంగా మార్చి పరిరక్షణ చర్యలు చేపట్టనున్నారు. వినోద కార్యక్రమాల కోసం చెరువు వెంట నాలుగు కిలో మీటర్ల మేర అంతరాయం లేకుండా రోడ్డు నిర్మిస్తారు. టాయ్ ట్రైన్ రైడ్, సైకిల్ ట్రాక్, ఫుడ్ కియోస్కి, షేడెడ్ సీటింగ్, ఏరియా ల్యాండ్ స్కేప్ గార్డెన్లు, అడ్వెంచర్ యాక్టివిటీల కోసం ప్రత్యేకమైన ఎరీనా తయారు చేస్తారు. అలాగే ఐటీఈఎస్ సెక్టార్ హబ్‌గా ఐటీ కంపెనీలు ఏర్పాటు చేసి లక్ష ఉద్యోగాలు కల్పిస్తారు. 6.40 లక్షల మంది నివాసానికి అనుగుణంగా ప్లాట్లు తయారు చేస్తారు. సామాజిక, ఆర్థిక సామర్థ్యాలతో వివిధ బహుళ పౌర కేంద్రాలు రూపొందిస్తారు.

ఐదువేల ఎకరాల్లో డిస్నీ ల్యాండ్.

ఇబ్రహీంపట్నం చెరువు చుట్టు పక్కల ప్రాంతాల్లో 3,200 ఎకరాల్లో వెంచర్‌తో పాటు దండుమైలారంలో 5 వేల ఎకరాల్లో వినోదాన్ని పంచే డిస్నీ ల్యాండ్ ఏర్పాటు చేయనున్నారు. ఇందుకోసం ఇప్పటికే భూసేకరణ పనులు మొదలు పెట్టారు.

రైతుల అంగీకారం మేరకే..



ఇబ్రహీంపట్నానికి 3,200 ఎకరాల్లో ప్రాజెక్టు రాబోతోంది. ఇందుకోసం ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ప్రస్తుతం గ్రామాల్లో ఆరు బృందాలు పని చేస్తున్నాయి. రైతులకు అవగాహన కల్పించిన తర్వాత వారు ముందుకు వస్తే భూసేకరణ ప్రక్రియ ప్రారంభిస్తాం. ఈ ప్రాంతంలో కన్సర్వేషన్ జోన్ ఉండడంతో ఈ ప్రాజెక్టుకు అనువుగా ఉంటుంది.

– మహమ్మద్ అసదుల్లా, అడిషనల్ కలెక్టర్, ల్యాండ్‌పూలింగ్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ శశాంక, అడిషనల్ కలెక్టర్లు

ఎన్నికల నిర్వహణకు సన్నద్ధం

కలెక్టర్ శశాంక

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ఎలాంటి లోటు పాట్లకు తావు లేకుండా లోక్‌సభ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్టు కలెక్టర్ శశాంక తెలిపారు. ఈ మేరకు బుధవారం రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వికాస్ రాజ్ జిల్లా కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన మాట్లాడారు. చేవెళ్ల బరిలో 43 మంది అభ్యర్థులు ఉన్నారని, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల అభ్యర్థులకు ఓటరు జాబితా, పోలింగ్ కేంద్రాల వివరాలను అందజేయడంతో పాటు ఎన్నికల సాధారణ పరిశీలకుల సమక్షంలో ఈసీ మార్గదర్శకాలకు అనుగుణంగా అభ్యర్థులందరికీ గుర్తులు కేటాయించామన్నారు. అభ్యర్థుల సంఖ్యకు అనుగుణంగా పోలింగ్ కోసం మూడు బ్యాలెట్ యూనిట్లు వినియోగించాల్సి ఉందని, ఈ మేరకు బుధవారం ఐసీఐఎల్ నుంచి బ్యాలెట్ యూనిట్లు ఈవీఎం గోడౌన్‌కు చేరుకున్నాయని తెలిపారు. ఓటరు సమాచార స్లిప్పులతో పాటు ఓటరు గైడ్, సీవిజిల్ కరపత్రాలను సైతం సిబ్బందితో ఇంటింటికీ తిరిగి పంపిణీ చేయిస్తున్నట్టు చెప్పారు. కొత్త ఓటర్లకు ఓటరు గుర్తింపు కార్డుల పంపిణీ ప్రక్రియను నిశితంగా పర్యవేక్షిస్తున్నామని, నిర్ణీత గడువులోపు పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల విధుల్లో పాల్గొంటున్న సిబ్బందికి పోస్టల్ బ్యాలెట్ సదుపాయం కల్పిస్తూ, అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని వివరించారు. 85 ఏళ్ల దాటిన సీనియర్ సిటిజన్ ఓటర్లు, దివ్యాంగ ఓటర్లు ఇంటి నుంచే ఓటు హక్కు వినియోగించుకునేందుకు వీలుగా ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలకు డమ్మీ బ్యాలెట్ పేపర్ ద్వారా ప్రయోగాత్మకంగా శిక్షణ ఇప్పించామని, పూర్తి పారదర్శకంగా, గోప్యతను పాటిస్తూ ఓటు సేకరించేలా పకడ్బందీ చర్యలు తీసుకున్నట్టు కలెక్టర్ తెలిపారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే పీఓలు, ఏపీఓలు, ఓపీఓలకు రెండో విడత శిక్షణ కొనసాగుతోందని, అన్ని పోలింగ్ కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉన్నాయన్నారు. కౌంటింగ్ కేంద్రంతో పాటు డిస్ట్రిబ్యూషన్, రిసీవింగ్ సెంటర్లు, స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పకడ్బందీ ఏర్పాట్లు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి అదనపు పోలీసు బలగాలను మోహరించేలా చర్యలు తీసుకున్నామని సీఈఓ దృష్టికి తెచ్చారు. సువిధ పోర్టల్ ద్వారా వచ్చే దరఖాస్తులను సకాలంలో పరిశీలిస్తూ వెంటవెంటనే అనుమతులు జారీ చేస్తున్నామని, సీవిజిల్ ఫిర్యాదులతో పాటు జిల్లా స్థాయిలో నెలకొల్పిన కంట్రోల్ రూంకు 1950 ద్వారా వచ్చే ఫిర్యాదులను సకాలంలో స్పందిస్తూ చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. వీడియో కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ప్రతిమా సింగ్, డీఆర్ఓ సంగీత, జెడ్పీ సీఈఓ కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న కేంద్రమంత్రి డా.మురుగన్

బీజేపీతోనే సుస్థిరత సాధ్యం

- అవినీతి పార్టీలన్నీ ఇండియా కూటమిగా జతకట్టాయి
- దేశానికి నరేంద్రమోదీ నాయకత్వమే శ్రీరామరక్ష
- కేంద్రమంత్రి డా.మురుగన్

ఆమనగల్లు: దేశంలోని అవినీతి పార్టీల్లో ఉన్న నేతలు కలిసి ఇండియా కూటమిగా జతకట్టారని కేంద్ర సమాచార, ప్రసార, పశుసంవర్ధక శాఖామంత్రి డా.మురుగన్ అన్నారు. బీజేపీతోనే దేశభద్రత, సుస్థిరత సాధ్యమని తెలిపారు. ఆమనగల్లు పట్టణంలోని పార్టీ కార్యాలయానికి వచ్చిన ఆయనకు జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు ఆచారి తదితరులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డా.మురుగన్ మాట్లాడారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం మూడోసారి అధికారంలోకి రావడం, మోదీ ప్రధాని కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. మోదీ నాయకత్వమే దేశానికి శ్రీరామరక్ష అన్నారు. అంబేడ్కర్ రచించిన భారత రాజ్యాంగాన్ని బీజేపీ భగవద్గీతతో సమానంగా భావిస్తుందని, రాజ్యాంగాన్ని మార్చే శక్తి దేశంలో ఎవరికీ లేదని ఆయన స్పష్టం చేశారు. రిజర్వేషన్లకు బీజేపీ కట్టుబడి ఉందని, రిజర్వేషన్లను బీజేపీ మారుస్తుందంటూ కొన్ని పార్టీలు చేస్తున్న విష ప్రచారాలను నమ్మొద్దన్నారు. ఇండియా కూటమిని నమ్మి అధికారం ఇస్తే ఏడాదికో ప్రధాని మారుతారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో అనేక అవినీతి, అక్రమాలు జరిగాయని.. మాజీ సీఎం కేసీఆర్ చేసిన పాపాలకు జైలుకు వెళ్లక తప్పదన్నారు. లోక్‌సభ ఎన్నికల్లో తెలంగాణలో బీఆర్ఎస్, కాంగ్రెస్‌కు ఓటమి తప్పదని, మెజార్టీ స్థానాల్లో బీజేపీ విజయకేతనం ఎగురవేస్తుందని జోస్యం చెప్పారు. సమవేశంలో పార్టీ రాష్ట్ర, జిల్లా నాయకులు జక్క రఘునందన్‌రెడ్డి, అశోక్‌రెడ్డి, శేఖర్ రెడ్డి, రామచంద్రారెడ్డి, కండె హరిప్రసాద్, కాసుల వెంకటేశ్, కుమార్, గోపాల్‌రెడ్డి, కృష్ణగౌడ్, రెడ్యనాయక్, గోరటి నర్సింహ తదితరులు పాల్గొన్నారు.

● కార్మికుల కవాతు

కార్మిక దినోత్సవాన్ని (మేడే) బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకొన్నారు. ఆయా సంఘాల ఆధ్వర్యంలో ర్యాలీలు నిర్వహించారు. చౌరస్తాలు, కంపెనీల వద్ద జెండాలను ఆవిష్కరించారు. వక్తలు మేడే విశిష్టత, కార్మికుల హక్కులను వివరించారు.




సీఐటీయూ ఆధ్వర్యంలో తుర్కయంజాల్‌లో ర్యాలీ

ఓటెత్తేలా..

ఎన్నికల సంఘం పటిష్ట చర్యలు



కేశంపేటలో ఓటరు చీటీలు పంపిణీ చేస్తున్న సిబ్బంది



ఎన్నికల సంఘం రూపొందించిన ఓటరు గైడ్ పుస్తకం

- ఓటర్లకు అవగాహన కార్యక్రమాలు
- చైతన్యం కల్పించేలా పుస్తక రూపం
- అర చేతిలోనే సమగ్ర సమాచారం
- ఓటరు గైడ్ పుస్తకాల ముద్రణ
- పంపిణీ చేయనున్న అధికారులు

షాద్‌నగర్: సార్వత్రిక ఎన్నికల్లో వందశాతం ఓటింగ్ లక్ష్యంగా ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఓటు ఆవశ్యకత గురించి అధికారులు విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన విషయాలను ప్రజలకు స్పష్టంగా తెలియజేస్తున్నారు. ఇందులో భాగంగా 'ఓటరు గైడ్' పేరిట బుక్‌లెట్లు సిద్ధం చేశారు.

ఇంటింటికీ పంపిణీ

దేశ భవిష్యత్తును మార్చే శక్తి ఓటుకు మాత్రమే ఉందని ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చే సందేశంతో ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన పూర్తి వివరాలు తెలిసేలా కేంద్ర ఎన్నికల సంఘం ఈసారి 15 పేజీలతో ఓటరు గైడ్ అనే చిన్న పుస్తకాన్ని ముద్రించింది. వీటిని బూత్ స్థాయి అధికారులు ఇంటింటికీ వెళ్లి ఓటరు స్లిప్పులతో పాటు ఓటర్లకు అందజేస్తారు. ప్రతి ఓటరుకు ఎన్నికల గురించి తెలిసేలా ముద్రించి ఈ పుస్తకం ఎంతో ఉపయోగపడేలా ఉంది.


ఓటరు గైడ్‌లో ఏముందంటే..

- ఓటరు జాబితాలో పేరు ఏవిధంగా నమోదు చేసుకోవాలి.. ఓటరు జాబితాలో ఉన్న పేరును ఏవిధంగా చూసుకోవాలి.. ఇందుకు ఉపయోగించే యాప్‌లు ఏమిటి అన్న విషయాలను బుక్‌లెట్‌లో పొందుపరిచారు.
- పోలింగ్ కేంద్రాన్ని ఏవిధంగా తెలుసుకోవచ్చు, ఓటు వేసేందుకు పోలింగ్ కేంద్రంలోకి వెళ్తే వేటిని అనుమతిస్తారు.. పోలింగ్ ప్రక్రియ ఏవిధంగా ఉంటుంది.. ఓటు వేసే విధానం గురించి ఫొటోలతో ప్రచురించారు.
- ఎన్నికల సంఘం కల్పిస్తున్న యాప్ సదుపాయాలు ఏమిటి.. వాటిని ఏవిధంగా ఉపయోగించొచ్చు.. నేతలు ఎన్నికల నిబంధనలు ఉల్లంఘిస్తే ఎవరికి ఫిర్యాదు చేయాలి.. సీ విజిల్ యాప్, 1950 టోల్ ఫ్రీ నంబర్ తదితర యాప్‌ల వివరాలు పొందుపరిచారు.
- పోలింగ్ కేంద్రాల్లో ఓటర్లకు కల్పించే మౌలిక సదుపాయాలు, ఇంటి నుంచి ఓటు వేసేందుకు ఏవిధంగా దరఖాస్తు చేసుకోవాలి, పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం, బరిలో ఉన్న అభ్యర్థుల వివరాలు అఫిడవిట్‌లను ఏవిధంగా చూడొచ్చు అన్న విషయాలను బుక్‌లెట్‌లో ముద్రించారు.

విస్తృత ప్రచారం

ఓటు వేసే విధానం, ఓటు వేసేందుకు అవసరమయ్యే పత్రాల గురించి అధికారులు బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, రద్దీ ప్రాంతాల్లో, ప్రభుత్వ కార్యాలయాల వద్ద, ముఖ్య కూడళ్ల వద్ద ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఓటు ఆవశ్యత గురించి ఇప్పటికే ర్యాలీలు, సమావేశాలు నిర్వహించారు. కళాశాల విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థలతో వివిధ శాఖల అధికారులతో అవగాహన కార్యక్రమాలు చేపట్టారు.

సమగ్ర వివరాలు



ఎన్నికల సంఘం రూపొందించి ఓటరు గైడ్ పుస్తకం ఓటర్లకు ఎంతో ఉపయోగపడుతుంది. ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన సమగ్ర వివరాలు ఇందులో ముద్రించారు. వీటిని ప్రతి ఓటరుకు పంపిణీ చేస్తున్నాం.

– వెంకటమాధవరావు, అసిస్టెంట్ రిటర్నింగ్ ఆఫీసర్, షాద్‌నగర్

కాంగ్రెస్‌తోనే ప్రజాపాలన



ప్రజలకు అభివాదం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి వంశీచంద్

కొందుర్గు: కేంద్రంలో ప్రజా పాలన వస్తేనే ప్రజల కష్టాలు తీరుతాయని కాంగ్రెస్ పార్టీ మహబూబ్‌నగర్ ఎంపీ అభ్యర్థి చల్లా వంశీచంద్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన కొందుర్గు, వనంపల్లి, ఆగిర్యాల, వెంకిర్యాల, కాస్లాబాద్, రావిర్యాల, గుర్రంపల్లి గ్రామాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఏటా లక్ష ఉగ్యోగాలు ఇస్తామన్న కేసీఆర్, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామన్న మోదీ పదేళ్లు పాలించి ఎన్ని ఉద్యోగాలు ఇచ్చారని ప్రశ్నించారు. పదేళ్ల పాలనలో ఇంతవరకు రేషన్ కార్డులు, ఇళ్లు ఇచ్చిన పాపాన పోలేదని విమర్శించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే ఆరు గ్యారంటీల అమలుకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. అనంతరం జిల్లేడ్ చౌదరిగూడ మండలం వనంపల్లి మాజీ సర్పంచ్‌లు కవిత, గోపాల్ రెడ్డితోపాటు వివిధ గ్రామాలకు చెందిన పలు పార్టీల నాయకులు కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, కొత్తూరు జెడ్పీటీసీ మాజీ సభ్యుడు శ్యామ్ సుందర్ రెడ్డి, పార్టీ మండల కమిటీ అధ్యక్షులు కృష్ణా రెడ్డి, కావలి రాజు, పీఏసీఎస్ చైర్మన్ దామోదర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చేవెళ్ల గడ్డపై కాంగ్రెస్ జెండా

- జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి
- రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఎన్నికల ప్రచారం



నందుపల్లిలో ప్రచారం చేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి

మహేశ్వరం: చేవెళ్ల ఎంపీ స్థానాన్ని గెలిపించి సీఎం రేవంత్‌రెడ్డికి కానుకగా ఇస్తామని జెడ్పీ చైర్‌పర్సన్ తీగల అనితారెడ్డి పేర్కొన్నారు. బుధవారం మండల పరిధిలోని గొల్లూరు, నాగారం, నందుపల్లి, పెండ్యాల, నాగిరెడ్డిపల్లి, మన్సాన్‌పల్లి, తుమ్మలూరు గ్రామాల్లో ఆమె కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డికి మద్దతుగా ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో మెజార్టీ ఎంపీ స్థానాలను కాంగ్రెస్ గెలుచుకుంటుందన్నారు. ఆరు గ్యారంటీలు, పాంచ్ న్యాయ్‌లను ప్రతి కార్యకర్త ప్రజల్లోకి తీసుకెళ్లి చైతన్యవంతం చేసి కాంగ్రెస్‌కు ఓటు వేయించాలన్నారు. బీజేపీ–బీఆర్‌ఎస్ పార్టీలు రెండు ఒక తాడు ముక్కలే అన్నారు. బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేస్తే బురదలో వేసినట్లే అన్నారు. ఆ రెండు పార్టీలను ప్రజలు నమ్మేస్థితిలో లేరన్నారు. బీజేపీ ఎంపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డిని చిత్తుగా ఓడించాలన్నారు. ప్రజల కోసం పని చేసే కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం రంజిత్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కావలి దశరథ, హరినాథ్‌గౌడ్, బాల్‌రాజ్, శివ, శేఖర్, రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌ది సంక్షేమ పాలన

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి



సీఎం సమక్షంలో కాంగ్రెస్‌లో చేరుతున్న నరోత్తంరెడ్డి, పెంటారెడ్డి, రవీందర్‌రెడ్డి(ఎడమ నుంచి కుడికి)

చేవెళ్ల/షాబాద్/ మొయినాబాద్: కాంగ్రెస్‌తోనే సంక్షేమ పాలన సాధ్యమని.. పార్టీ బలోపేతానికి కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. బుధవారం చేవెళ్ల మండలం కందవాడ గ్రామానికి చెందిన శేరి పెంటారెడ్డి, షాబాద్ మండలం నాగర్‌కుంట గ్రామానికి చెందిన నెంటూరి రవీందర్‌రెడ్డి, మొయినాబాద్ మండలం పెద్ద మంగళారం మాజీ సర్పంచ్ కోట్ల నరోత్తం రెడ్డి తమ అనుచరులతో కలిసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ముఖ్యమంత్రి వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రజా సంక్షేమ పాలన కొనసాగిస్తోందని .. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు ఆరు గ్యారంటీల అమలు విషయంలో చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తన సత్తా చాటుతుందన్నారు. షాబాద్ మండలం నుంచి 30 వేల మెజార్టీ ఇస్తామన్నామని దీమా వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నియంత పాలన పోయి బడుగు, బలహీన వర్గాల ప్రభుత్వం వచ్చిందన్నారు. కాంగ్రెస్ ప్రకటించిన ఆరు గ్యారంటీలు పేదల జీవితాల్లో వెలుగులు నింపుతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ అభ్యర్థి రంజిత్‌రెడ్డి, చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికల్లో ఇన్‌చార్జి చింపుల సత్యనారాయణరెడ్డి, అసెంబ్లీ ఇన్‌చార్జి పామెన భీంభరత్, టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి పీసరి సురేందర్‌రెడ్డి, చల్లా మాధవరెడ్డి తదితరులున్నారు.

బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా విజయేందర్



పహాడీషరీఫ్: బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడిగా మామిడిపల్లి గ్రామానికి చెందిన లిక్కి విజయేందర్ రెడ్డి నియమితులయ్యారు. బీజేవైఎం అధ్యక్షుడు టి.యాదీష్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా బుధవారం విజయేందర్ రెడ్డి మాట్లాడుతూ.. పార్టీ అభ్యర్థుల విజయం కోసం తన వంతుగా కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో పదవి అప్పగించిన రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్, జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, యాదీష్, మద్ది రాజశేఖర్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

యువతి అదృశ్యం



కావేరి(ఫైల్)

పహాడీషరీఫ్: కంపెనీలో పనికి వెళ్లిన యువతి కనిపించకుండా పోయిన సంఘటన పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. బుధవారం పోలీసులు తెలిపిన ప్రకారం.. జల్‌పల్లి శ్రీరాం కాలనీకి చెందిన సంగం వెంకటయ్య కుమార్తె కావేరి(18) స్థానికంగా ఉన్న అల్లం వెల్లుల్లి పేస్ట్ తయారీ కంపెనీలో పని చేస్తోంది. ఏప్రిల్ 28న రోజు మాదిరిగానే ఉదయం 10 గంటలకు డ్యూటీకి వెళ్లిన ఆమె రాత్రి 8 గంటలవుతున్నా తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఎక్కడ వెతికినా ఆచూకీ లభించలేదు. ఈ విషయమై షాద్‌నగర్‌కు చెందిన శ్రీనివాస్ అనే యువకుడిపై అనుమానం ఉందంటూ తల్లి పద్మమ్మ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆచూకీ తెలిసిన వారు పోలీస్‌స్టేషన్‌లో గాని 87126 62367 నంబర్‌లో సమాచారం అందించాలని పోలీసులు కోరారు. కేసు దర్యాప్తులో ఉంది.

అక్రమార్జనకే పార్టీల మార్పు

- బీఆర్‌ఎస్ నాయకులను బెదిరించి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారు
- చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య
- మొయినాబాద్‌లో బీఆర్‌ఎస్ కార్యాలయం ప్రారంభోత్సవం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాలె యాదయ్య

మొయినాబాద్: అక్రమ సంపాదనకు పాల్పడేవారు మాత్రమే పార్టీలు మారుతారని చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య ఆరోపించారు. బుధవారం మండల కేంద్రంలో బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ నాయకులను భయపెట్టి, ప్రలోభాలకు గురిచేసి కాంగ్రెస్‌లో చేర్చుకుంటున్నారన్నారు. పదేళ్ల పాటు తనతో ఉండి పనులు చేయించుకున్న నాయకులు ఇప్పుడు పార్టీని, నన్ను మోసం చేసి ఇతర పార్టీల్లోకి వెళ్తున్నారన్నారు. అలాంటి నాయకులు పార్టీ వీడినా కార్యకర్తలు భయపడవద్దని.. మీరే నాయకులుగా ఎదగాలన్నారు. లోక్ సభ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధిస్తుందని.. అందుకోసం కార్యకర్తలు కష్టపడి పనిచేయాలని సూచించారు. అధికారంలోకి వచ్చిన ఐదు నెలల్లోనే ప్రజల్లో కాంగ్రెస్‌పై వ్యతిరేకత మొదలైందన్నారు. కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించి పార్లమెంటు ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించేందుకు కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్లమెంట్ ఇన్‌చార్జి రాంబాబు, జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కొంపల్లి అనంతరెడ్డి, పార్టీ మండల ఉపాధ్యక్షుడు జయవంత్, ప్రధాన కార్యదర్శి నర్సింహగౌడ్, మైనార్టీ నేత షేక్ మహబూబ్, ఏఎంసీ మాజీ వైస్ చైర్మన్‌లు రవూఫ్, రాజు, వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్‌లు శ్రీహరి, కుమార్, సిద్దయ్య, సీనియర్ నాయకులు ఆంజనేయులు, కృష్ణారెడ్డి, గణేశ్‌రెడ్డి నాయకులు ప్రవీణ్ రెడ్డి, తిరుపతిరెడ్డి, పరమేశ్, కృష్ణ, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

నైజీరియన్లు నివసించే ఇళ్లలో పోలీసుల తనిఖీ



సన్‌సిటీలో పోలీసుల కార్డన్ సెర్చ్

బండ్లగూడ: శాంతి భద్రతల పరిరక్షణలో భాగంగా రాజేంద్రనగర్, నార్సింగి పోలీస్‌స్టేషన్ల పరిధిలో బుధవారం ఉదయం 5 నుంచి 8గంటల వరకు పోలీసులు బృందాలుగా ఏర్పడి సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. డ్రగ్స్ దందాపై దృష్టి పెట్టిన పోలీసులు సన్‌సిటీ, హైదర్షాకోట్ ప్రాంతాలలోని పీఎస్‌టీ కాలనీ, నర్సారెడ్డి కాలనీ, హీరానగర్ కాలనీలలో నైజీరియన్లు నివసించే ఇంటింటికి వెళ్లి వారి వివరాలపై ఆరా తీశారు. సరైన వాహన ధృవపత్రాలను, పాస్‌పోర్టులు, వీసాలను పరిశీలించారు. వీసా గడువు ముగిసినా కొందరు నైజీరియన్లు అక్రమంగా రాష్ట్రంలో ఉంటున్నట్లు గుర్తించారు. సూడాన్ దేశానికి చెందిన ఒక మహిళ వీసా గడువు ముగిసినా కూడా ఇక్కడ నివాసం ఉంటున్నందున అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేశారు.

పదవుల్లో ప్రాధాన్యత ఇవ్వండి

కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి శ్రీనివాసరావు



మంత్రి శ్రీధర్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న శ్రీనివాసరావు

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్‌లో కొన్ని ఏళ్లుగా పని చేస్తున్న బ్రాహ్మణ సామాజిక వర్గానికి చైర్మన్, డైరెక్టర్ పదవులు ఇచ్చి ప్రోత్సహించాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు మంగళవారం ఐటీ మంత్రి శ్రీధర్‌బాబును కలిసి వినతి పత్రం అందజేశారు. పార్టీ కష్ట పరిస్థితుల్లో ఉన్న సమయంలోనూ అండగా నిలిచిన తమ సామాజిక వర్గం వారికి అవకాశం కల్పించాలని కోరారు. అందుకు మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఆయన వెంట చింతపల్లి మంగపతిరావు, వారణాసి వంశీ ఉన్నారు.

పోక్సో కేసులో 20 ఏళ్ల జైలు

ప్రేమ పేరిట బాలికను మోసం చేసిన యువకుడికి రూ.40 వేల జరిమానా



కేసు వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ కిషన్, సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్

చేవెళ్ల: బాలికను ప్రేమ పేరిటి నమ్మించి అత్యాచారం చేసిన వ్యక్తికి ఎల్‌బీనగర్ ఫాస్ట్ ట్రాక్ కోర్టు స్పెషల్ జడ్జి హరీష 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.40 వేల జరిమానా విధిస్తూ తీర్పునిచ్చినట్లు చేవెళ్ల ఏసీపీ బి.కిషన్ తెలిపారు. బుధవారం ఆయన ఏసీపీ కార్యాలయంలో సీఐ లక్ష్మారెడ్డి, ఎస్‌ఐ ప్రదీప్‌కుమార్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. 2017లో సంగారెడ్డి జిల్లా కలహర్ మండలం కిష్టాపూర్ గ్రామానికి చెందిన గావిని రత్నయ్య అలియాస్ రత్నం(కిరణ్) ఫోన్‌లో ఓ బాలికతో పరిచయం పెంచుకుని ప్రేమిస్తున్నానని నమ్మించాడు. వారిద్దరూ చేవెళ్లలోనే తరచూ కలుసుకునేవారు.. పెళ్లి చేసుకుంటానని నమ్మించి యాదగిరి గుట్టకు తీసుకెళ్లి అక్కడే ఓ గదిని అద్దెకు తీసుకుని అక్కడే లోబర్చుకున్నాడు. బాలిక గర్భం దాల్చి వివాహానికి ఒత్తిడి తెచ్చింది. దీంతో తనకు ఎలాంటి సంబంధం లేదంటూ బుకాయించాడు. దీంతో బాలిక కుటుంబ సభ్యులు చేవెళ్ల ఠాణాలో ఫిర్యాదు చేశారు. అప్పటి సీఐ గురువయ్యగౌడ్ పోక్సో చట్టం కింద కేసు దర్యాప్తు చేపట్టారు. ఎల్‌బీనగర్ ఫాస్ట్ ట్రాక్ కోర్టులో పీపీ కోమలత ఈ కేసు వాదోపవాదాలు వినిపించింది. ఫాస్ట్ ట్రాక్ ప్రత్యేక కోర్టు జడ్జి హరీష రత్నయ్యకు 20 ఏళ్ల జైలు శిక్ష, రూ.40వేల జరిమానా విధిస్తూ తీర్పు వెల్లడించింది

గుర్తుతెలియని వృద్ధుడి మృతి



కందుకూరు: వడదెబ్బతో గుర్తుతెలియని ఓ వృద్ధుడు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. ఈ సంఘటన కందుకూరు పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ మక్బూల్‌జానీ తెలిపిన ప్రకారం.. కందుకూరు చౌరస్తాలో ఏప్రిల్ 29న మధ్యాహ్నం గుర్తుతెలియని ఓ వృద్ధుడు అస్వస్థతకు గురయ్యాడు. గమనించిన పోలీసులు 108 అంబులెన్స్ వాహనంలో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతున్న ఆయన బుధవారం ఉదయం మరణించాడు. అతని వయస్సు 60–65 సంవత్సరాలు ఉంటుంది. వివరాలు తెలియరాలేదని సంబంధీకులు ఎవరైనా ఉంటే సెల్ నంబర్ 8712662396కు సమాచారం అందించాలని సీఐ కోరారు.

రైలు ప్రమాదంలో ఇద్దరి మృతి

షాద్‌నగర్‌రూరల్: రైలు పట్టాలపై గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని లింగారెడ్డిగూడ సమీపంలో బుధవారం చోటుచేసుకుంది. రైల్వే హెడ్‌కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన ప్రకారం.. గుర్తు తెలియని రైలు ఢీకొట్టడంతో గుర్తు తెలియని వ్యక్తి(55) మృతి చెందాడు. మృతుడి శరీరంపై తెలుపు బనియన్, నలుపు డ్రాయర్, కుడి చేతికి నల్లని దారం ధరించాడు. మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వివరా లు తెలిసిన వారు రైల్వే పోలీసులకు 9848090426 నంబర్‌లో సమాచా రం ఇవ్వాలని కోరారు. షాద్‌నగర్ స్టేషన్ మాస్టర్ ఠాకూర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు రైల్వే హెడ్‌కానిస్టేబుల్ తెలిపారు.

కార్మికుడి మృతి

నందిగామ: పట్టాలు దాటుతున్న కార్మికుడు రైలు ఢీకొట్టడంతో దుర్మరణం చెందాడు. ఈ ఘటన నందిగామలో బుధవారం వెలుగులోకి వచ్చింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ మల్లేశ్వర్ తెలిపిన ప్రకారం వివరాలు.. అస్సాం రాష్ట్రానికి చెందిన ప్రణబ్‌దాస్(46) నందిగామకు వలస వచ్చాడు. స్థానిక పరిశ్రమలో కార్మికుడిగా పనిచేస్తున్నాడు. మంగళవారం అర్ధరాత్రి తర్వాత స్థానిక పీహెచ్‌సీ వెనకాల రైల్వే పట్టాల మీదుగా నడుచుకుంటూ వెళ్తుండగా గుర్తుతెలియని రైలు ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ప్రణబ్‌దాస్ అక్కడికక్కడే మృతి చెందాడు. బుధవారం మృతదేహాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం షాద్‌నగర్‌లోని సీహెచ్‌సీకి తరలించారు. షాద్‌నగర్ రైల్వే స్టేషన్ మాస్టర్ ఠాగూర్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెబుదాం

- కాసానిని గెలిపించుకుందాం
- ఓటమి భయంతోనే కేసీఆర్‌పై ఈసీకి ఫిర్యాదు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితారెడ్డి



నందిహిల్స్‌లో కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న సబితారెడ్డి. చిత్రంలో కాసాని జ్ఞానేశ్వర్

మీర్‌పేట: కేసీఆర్ గ్రామాల్లో ఎండిన పంటలను పరిశీలిస్తుంటే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రైతు సమస్యలను వదిలి ఐపీఎల్ మ్యాచ్ చూస్తున్నారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డి ఆరోపించారు. బుధవారం ఆమె మీర్‌పేట నందిహిల్స్ చౌరస్తాలో బీఆర్‌ఎస్ కార్నర్ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ ఇబ్బందుల్లో ఉన్నప్పుడు మానవత్వం లేకుండా పార్టీ మారిన రంజిత్‌రెడ్డికి, ఏనాడూ ప్రజా సమస్యలు పట్టించుకోని కొండా విశ్వేశ్వర్‌రెడ్డికి ఈ ఎన్నికల్లో బుద్ధి చెప్పాలన్నారు. పేద వర్గాలకు అండగా ఉంటున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత మనపై ఉందన్నారు. రాష్ట్రంలో కరెంటు పోయినా, నీరు రాకపోయినా, పంటలు ఎండిపోయినా పట్టించుకునే దిక్కే లేదని, కేసీఆర్ సభలకు ప్రజలందరూ బ్రహ్మరథం పడుతూ కష్టాలు చెప్పుకుంటుంటే భయంతో కాంగ్రెస్ నాయకులు 48 గంటలు ప్రచారం చేయకుండా ఈసీకి ఫిర్యాదు చేశారని చెప్పారు. పంటలు ఎండిపోయి ఆత్మహత్య చేసుకున్న రైతులకు ఒక్కరూపాయి పరిహారం ఇవ్వలేదని, రూ.2500ల ఆర్థికసాయం, రుణమాఫీ ఇప్పటివరకు లేదన్నారు.

ముఖ్యమంత్రికి కౌంటర్

గత అసెంబ్లీ ఎన్నికల్లో సబితక్క కొంచెంలో తప్పించుకుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారని.. కాంగ్రెస్ అభ్యర్థికి తనకు 60 వేల ఓట్ల తేడా ఉంది తమ్ముడు అని సబితారెడ్డి స్పష్టత ఇచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థిని గెలిపించి ఉంటే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేవారమంటూ చెప్పిన ముఖ్యమంత్రి నేడు ఓట్లు ఎలా అడుగుతున్నారని ఆమె ప్రశ్నించారు. కేసీఆర్ ఇంటి మీద వాలిన కాకి మా ఇంటి మీద వాలితే కాల్చి చంపుతామని అంటున్న ముఖ్యమంత్రి పక్కనున్న నాయకులు, పోటీ చేస్తున్న వారు ఎక్కడి నుంచి వచ్చారో చెప్పాలని సబితారెడ్డి ప్రశ్నించారు. ముఖ్యమంత్రి స్థాయికి తగ్గట్లు మాట్లాడితే బావుంటుందని హితవు పలికారు. మహిళలను విమర్శించే విధానం సరికాదని ఆమె హెచ్చరించారు. రేవంత్‌రెడ్డి డ్యూయల్ రోల్ పోషిస్తున్నారని, రాజకీయాలపై ఉన్న శ్రద్ధ ప్రజాపాలనపై లేదని విమర్శించారు. మోదీని, రాముడిని చూసి ఓటు వేయాలని బీజేపీ వాళ్లు అంటున్నారు తప్ప ప్రజలకు ఏం చేస్తామో చెప్పడం లేదని, పదేళ్లలో బీజేపీ రాష్ట్రానికి చేసిందేమీ లేదన్నారు. ఈ సమావేశంలో మేయర్ ఎం.దుర్గా దీప్‌లాల్ చౌహాన్, డిప్యూటీ మేయర్ తీగల విక్రంరెడ్డి, పార్టీ మీర్‌పేట అధ్యక్షుడు అర్కల కామేశ్‌రెడ్డి, కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.

ఆలోచించి ఓటు వేయాలి: కాసాని

పదేళ్ల కేసీఆర్ పాలన, నాలుగు నెలల కాంగ్రెస్ పాలనను గమనించాలని పనిచేసే నాయకులను ఈ ఎన్నికల్లో గుర్తించి ఓటు వేయాలని బీఆర్‌ఎస్ చేవెళ్ల అభ్యర్థి కాసాని జ్ఞానేశ్వర్ సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులు, పట్టణ ప్రాంతాల్లోని ప్రజల భవిష్యత్ దూరదృష్టితో పనిచేసిన గొప్ప నాయకుడు కేసీఆర్ అని కొనియాడారు. కేసీఆర్ ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారని, ఈ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ అత్యధిక స్థానాలను గెలుచుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.

అమ్మా మళ్లీ వస్తానని.. అనంత లోకాలకు

రోడ్డు ప్రమాదంలో యువకుడి దుర్మరణం



సందీప్(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: ఏడాది క్రితమే భర్తను పోగొట్టుకున్న ఆమె బాధను దిగమింగుతూ కొడుకుపై ఆశలు పెంచుకుంది. కానీ విధి ఆ తల్లి ఆశలను అడియాశలు చేసింది. రోడ్డు ప్రమాదం రూపంలో ఆమె కుమారుడిని పొట్టనబెట్టుకుంది. ఈ హృదయవిదారక ఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్టలో మంగళవారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ శరత్‌కుమార్ తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని మొగిలిగిద్దకు చెందిన విజయలక్ష్మి చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెకండ్ ఏఎన్‌ఎంగా పనిచేస్తోంది. ఆమె కుమారుడు సందీప్(25) ఎలికట్ట సమీపంలోని ఓ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. మంగళవారం రాత్రి తన మిత్రుడు ఫోన్ చేసాడని.. మళ్లీ వస్తానని చెప్పి బైక్‌పై షాద్‌నగర్ వైపు వెళ్తున్నాడు. ఎలికట్ట సమీపంలో రోడ్డుపై నిలిపిన లారీని వెనుక నుంచి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో సందీప్ తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఘటనా స్థలికి చేరకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సహోద్యోగుల సాయం

చించోడ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సెకండ్ ఏఎన్‌ఎంగా పని చేస్తున్న విజయలక్ష్మిది నిరుపేద కుటుంబం. భర్తను, కొడుకును పోగొట్టుకొని బాధలో ఉన్న విజయలక్ష్మిని ఆదుకునేందుకు సహోద్యోగులు, ఆయా మండలాల వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది తమవంతుగా రూ.20వేల ఆర్థికసాయం అందజేశారు.

ఒకే ఈతలో రెండు లేగదూడలు



మండల పరిధిలోని ముచ్చర్లలో బుధవారం ఓ ఆవు రెండు లేగ దూడలకు జన్మనిచ్చింది. గ్రామానికి చెందిన రైతు బుడ్డోని నర్సింహకు చెందిన పాడి ఆవు రెండు కోడెదూడలకు జన్మనిచ్చింది. రెండు దూడలు ఆరోగ్యంగానే ఉన్నట్లు రైతు కుటుంబ సభ్యులు సంతోషం వ్యక్తం చేశారు. గ్రామస్తులు ఆసక్తిగా తిలకించారు.

– కందుకూరు